మున్సిపాలిటీలో స్వచ్ఛతా హీ సేవా ప్రారంభం


నాగారం మున్సిపాలిటీలో చైర్మన్ చంద్రారెడ్డి

మేడ్చల్ : మున్సిపాలిటీలో అక్టోబర్ 2 వరకు నిర్వహించే 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలను మేడ్చల్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ దీపికానర్సింహ్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె కోరారు. ప్రతిజ్ఞ, మానవహారం, సెల్ఫీపాయింట్, విద్యార్థులకు పోటీలు, స్వచ్ఛత రన్ వ్యర్థాలు వేసే ప్రాంతాలను గుర్తించి వాటిని శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో వాల్‌పోస్టర్లు విడుదల చేసి ప్రతిజ్ఞ చేశారు. కమిషనర్ నాగిరెడ్డి, ఎన్విరాల్‌మెంట్ ఈఏ జ్ఞానేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

కీసర: నాగారం పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండువారాల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో ప్రజలు, స్వచ్ఛంద సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ప్రజలతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద ర్‌కుమార్, కౌన్సిలర్లు, కో- ఆప్షన్ సభ్యులు, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

పోచారం: పరిశుభ్రతే సేవ అనే నినాదంతో స్వచ్ఛతా హి కార్యక్రమాన్ని పోచారం మున్సిపాలిటీ పరిధిలో చైర్మన్ కొండల్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 17 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. స్వచ్ఛతా కార్యక్రమాలను వేగవంతం చేయాలని స్వచ్ఛంద సంఘాలు, విద్యాసంస్థలు, సామాజిక, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు.వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ పోరాట స్ఫూర్తితో సమగ్రాభివృద్ధి

- ప్రజాపాలన దినోత్సవంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి
- జాతీయ జెండా ఆవిష్కరణ
- రూ.15,869 కోట్ల పెట్టుబడులతో 2.38 లక్షల మందికి ఉపాధి


జాతీయ పతాక ఆవిష్కరణలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, కలెక్టర్లు, పోలీసులు

సాక్షి,సిటీబ్యూరో: మహనీయుల అసమాన త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ.. ఆ పోరాట స్ఫూర్తితో మేడ్చల్ జిల్లాను అభివృద్ధి పథంలో ముందుంచేందుకు మన అందరం కృషి చేయాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, మేడ్చల్ జిల్లాలో రూ.15,869 కోట్లతో 13,734 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలను స్థాపించటం ద్వారా 2.38 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు.

- నూతన పరిశ్రమల ఏర్పాటుకు 6,850 మంది పారిశ్రామిక వేత్తలకు వివిధ రాయితీల కింద రూ.612.73 కోట్లు మంజూరు చేశామన్నారు. రుణభారంతో బతుకు భారమైన రైతన్న'రైతు నేస్తం' పథకంతో రుణ మాఫీతో గర్వంగా తలెత్తుకుని తిరుగుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకం ద్వారా బాలికలు, మహిళలు, ఇతరులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.
- రూ.500లతో 74,457 మందికి సిలిండర్లు..
- వంట గ్యాస్ సబ్సిడి పథకం కింద జిల్లాలో రూ.500లతో అర్హులైన 74,457 మంది లబ్ధిదారులకు 1,72,393 గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.
- గృహజ్యోతి కింద ప్రతినెల 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తున్నామన్నారు. పేద ప్రజలకు 1835 రకాల వైద్య చికిత్సలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ''రాజీవ్ ఆరోగ్య శ్రీ'' పథకం ద్వారా ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు.

భద్రత కోసం'టీ సేఫ్'యాప్..

మహిళలు, చిన్నారుల భద్రత కోసం ''టీ సేఫ్'' యాప్ ద్వారా 24 గంటలు రక్షణ కల్పించడానికి ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, జిల్లా అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి, డీసీపీ కోటిరెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ పార్టీల జిల్లా నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ కళాకారుల ఆలపించిన తెలంగాణ గీతాలు ఆహుతులను అలరింపజేశాయి.

అక్రమ నిర్మాణాల నిలిపివేత


నిర్మాణ పనులు ఇలా..

సాక్షి ఎఫెక్ట్..

మేడ్చల్ : మండలంలోని డబీల్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలను గ్రామ పంచాయతీ సిబ్బంది అడ్డుకుని పనులను నిలిపివేయించారు. దీనిపై సాక్షిలో ఇటీవల 'కాగితం మీదే లేఅవుట్' అనే శీర్షికన కథనం ప్రచురించింది. మంగళవారం కొందరు లేఅవుట్ వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా ప్రహరీ, ఇతర నిర్మాణపనులు చేస్తుండటంతో కార్యదర్శి ఉమాదేవి పనులను నిలిపివేయించారు. అనుమతులు లేని నిర్మాణాలు చేస్తుండటంతో పనులు నిలిపివేయించామని తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి


మృతిచెందిన రాజేందర్

జవహర్‌నగర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిద్దెపల్లి రాజేందర్ (45), మరోవ్యక్తి మాణిక్యం ఇద్దరు కలిసి బోరబండలో నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ తెలిసిన వారికి ఫైనాన్స్ ఇస్తూ.. డబ్బులు వసూలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బాలాజీనగర్‌లోని ఆర్ఎంపీ డాక్టర్ పెంటాచారికి రూ. లక్ష ఫైనాన్స్ ఇచ్చారు. డబ్బులు తీసుకున్న అతడు వాయిదాలు పెడుతుండటంతో పట్టుకుని డబ్బులు వసూలు చేద్దామని సోమవారం రాత్రి 11 గంటలకు ఓ గల్లీలో మద్యం సేవించారు. మాణిక్యం నిద్రలేచి రాజేందర్‌ను లేపేందుకు యత్నించగా.. నిద్రలేవలేదు. దీంతో వెంటనే 108కి ఫోన్ చేయగా వారు ఘటనా స్థలానికి చేరుకుని పరీక్షించారు. కాగా రాజేందర్ అప్పటికే మృతిచెందాడని తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీమ్ సాయంలో ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీర్యాలలో లడ్డూ రూ.2.08 లక్షలు


లడ్డూ ప్రసాదంతో మెట్టు శ్రీకాంత్‌రెడ్డి


దమ్మాయిగూడలో రూ.62 వేలకు దక్కించుకున్న మహ్మద్ పాషాబేగ్

కీసర: చీర్యాలలో ఎస్‌జేఆర్ కాలనీ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో రూ.2.08 లక్షలకు మెట్టు శ్రీకాంత్‌రెడ్డి దక్కించుకున్నారు. కీసర మండలంలో ఇదే రికార్డు ధరగా పలికింది. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధి, రామలింగేశ్వరకాలనీలోని సాయిబాబా గుడి వద్ద జరిగిన వేలంలో మహ్మద్ పాషా బైగ్ రూ.62 వేలకు పాడి కైవసం చేసుకున్నారు. కౌన్సిలర్ వరగంటి వెంకటేష్, గోధుమకుంట మాజీ ఎంపీటీసీ మంచాల కిరణ్ జ్యోతిప్రవీణ్‌కుమార్, కాలనీవాసులు రాజిరెడ్డి, వంగ శ్రీనివాస్‌రెడ్డి, పుట్ట శ్రీనివాస్‌గౌడ్, రమేష్, తాండూర్ భిక్షపతి, ఎర్రగుల శ్యామ్, నల్ల చంద్రయ్య, పుట్ట సత్యనారాయణ, రవిగౌడ్, నోముల శ్రీనివాస్‌రెడ్డి, తుడుం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


పోస్టర్ ఆవిష్కరణలో ఆటో యూనియన్ సభ్యులు

బౌద్ధనగర్: ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ ఉమర్ ఖాన్ కోరారు. కొత్తగూడెంలో ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆటో క్యాబ్ ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడో మహాసభల పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని , ఏడాదికి రూ 12 వేల ప్రభుత్వం ఇవ్వాలనే డిమాండ్ల సాధనకు తలపెట్టిన మహాసభకు ఆటో కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లతీపుద్దీన్, లక్ష్మణ్, ఆరిఫ్‌గౌస్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



మేడ్చల్: విశ్వకర్మ జయంతి ఉత్సవాలను పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించారు. మంగళవారం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, హోమం నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. విశ్వబ్రహ్మణులు విష్ణుచారి, మల్లేష్చారి, వెంకటేశంచారి, రవిశంకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

అడ్డగుట్ట: వినాయకుడి ఊరేగింపులో వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్టలోని మొండిబండానగర్ నుంచి అడ్డగుట్ట కమ్యూనిటీహాల్ వైపు గణనాథుని ఊరేగింపు వస్తుంది. కమ్యూనిటీహాలు సమీపంలోని మలుపులో అడ్డుగా ఉన్న బైక్‌ను నిర్వాహకుడు రామ్‌చందర్ పక్కకు జరుపుతున్నాడు. సదరు వాహన యజమానులు షాను(19), అనీష్(25) వచ్చి తమ అనుమతి లేకుండా ఎలా జరుపుతావని వాగ్వాదానికి దిగి రామ్‌చందర్‌పై దాడి చేశారు. దీంతో బాధితుడు మంగళవారం తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ప్రధాని జన్మదిన వేడుకలు


ప్రధాని చిత్రపటానికి అభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు


చిన్నారులకు పండ్లు అందజేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా మేడ్చల్‌లో బీజేపీ నేతలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్‌లోని శివాజీ విగ్రహం వద్ద ప్రధాని కటౌట్ ఏర్పాటు చేసి పాలాభిషేకం చేశారు. పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు జగన్‌గౌడ్, ప్రేమ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు..

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లిలో బీజేపీ నేతలు చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్, కౌన్సిలర్లు మల్లికార్జున్‌ముదిరాజ్, అమరం సరస్వతి, నాయకులు కిషన్, అశోక్, సురేష్, నవీన్, శ్రీకాంత్, నవనీత, భారతి తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం విరాళం..


గోవులకు మేత తినిపిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: గోపీకృష్ణ కాలనీలోని వేణుగోపాల స్వామి గుడికి చెందిన గోశాలకు ట్రక్కు పశుగ్రాసం కోసం నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి రూ. 21 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. దేశమే తన కుటుంబమని భావించిన గోవుల ప్రేమికుడు మోదీ జన్మదినోత్సవాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నేత రామక్కపేట రవీందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సూర్యశేఖర్ రెడ్డి, నరేష్, పవన్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం


తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు

మల్లాపూర్: తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి తెలంగాణ తల్లిని అవమాన పరిచారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాలాభిషేకం చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సచివాలయం వద్ద తెలంగాణ తల్లి కోసం కేటాయించిన స్థానంలో కేవలం రాజకీయ దురుద్దేశంతో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టి తెలంగాణ తల్లిని అవమానపరిచారని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడాపోటీలు

కుషాయిగూడ: కీసర జోనల్ స్థాయి క్రీడా పోటీలు కుషాయిగూడలో జెడ్పీ స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్నారు. ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించే ఈ క్రీడల్లో కాప్రా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, గుర్తింపు పొందిన ప్రైవేటు స్కూల్స్ పాల్గొనవచ్చని ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రటరీ ప్రభాకర్ తెలిపారు. 14 నుంచి 17 ఏళ్లున్న విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనేందుకు అర్హులని ప్రకటించారు. ఆసక్తిగల క్రీడాకారులు ఒరిజినల్ బోనాఫైడ్‌తో పాటు పీఈఎన్ నంబర్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను ఈనెల 19న ఉదయం 9 గంటలకు కుషాయిగూడ జెడ్పీ స్కూల్‌లో అందించాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 9948263609.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం


మేడ్చల్‌లో జెండా ఎగురవేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో మంగళవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ శాంతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పోచారం: తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా పోచారం పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో చైర్మన్ కొండల్‌రెడ్డి జాతీయ జెండాను మంగళవారం ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ.. నిజాం నిరంకుశపాలన నుంచి తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సిద్ధించిన రోజును ఈ ఏడాది ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామన్నారు.

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో చైర్‌పర్సన్ వసుపతి ప్రణీతాశ్రీకాంత్‌గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్న సంకల్పంతో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టామన్నారు. వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ ఎ.నాగమణి, మేనేజర్ ఎ.వెంకటేశం, కౌన్సిలర్లు, కో- ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ప్రజా పాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. కమిషనర్ సాబేర్ అలీ, ఆర్‌డీఎంఏ శ్రీనివాస్‌తో కలిసి స్వచ్ఛత హీ సేవా–2024లో భాగంగా ఇల్లు, పరిసరాలు, నగరాన్ని చెత్త చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. కౌన్సిల్ సభ్యులు వెంకట్ రెడ్డి, రమాదేవి, సంగీత, ఆంజనేయులుగౌడ్, మల్లేష్, నరేష్‌యాదవ్, నర్సింగ్‌రావు, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, నాయకులు ఆంజనేయులుయాదవ్, స్టీవెన్, అంజిరెడ్డి, చిత్తారియాదవ్, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్, సంజీవరెడ్డి, నరేష్, నర్సింగ్‌రావు, రహమాన్, బాబు, గౌస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ శాంతి


పోచారం మున్సిపల్ ఆఫీస్‌లో చైర్మన్ కొండల్‌రెడ్డి


దమ్మాయిగూడలో చైర్‌పర్సన్ ప్రణీత


ఘట్‌కేసర్‌లో చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం


గుండ్లపోచంపల్లిలో జెండా ఆవిష్కరణ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్


బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో..

మేడ్చల్‌రూరల్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లోని నేతలు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. గుండ్లపోచంపల్లిలో మినీట్యాంక్‌బండ్‌పై మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ స్వామి, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, బాలరాజు, హేమంత్‌రెడ్డి, అమరం సరస్వతీమోహన్‌రెడ్డిలతో కలిసి జాతీయజెండాను ఆవిష్కరించారు. లక్ష్మీనగర్ కాలనీ కమాన్ వద్ద బీజేపీ మేడ్చల్‌రూరల్ జిల్లా అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, పార్టీ నాయకులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించి విమోచన దినోత్సవాన్ని జరిపారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు మల్లికార్జున్‌ముదిరాజ్, సరస్వతి, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ కాంపిటీషన్‌లో ప్రతిభ


అవార్డు అందుకుంటున్న తనిష్క

అడ్డగుట్ట: భారతీయ రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ నిర్వహించిన డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ కాంపిటీషన్‌లో అడ్డగుట్టకు చెందిన పల్లప్ తనిష్క రెండో స్థానం సాధించింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో సోమవారం జరిగిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవానికి హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల చేతుల మీదుగా తనిష్క అవార్డు అందుకున్నది.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న సీఈవో మధుకర్ నాయక్

రసూల్‌పురా: పరిసరాల శుభ్రతకు నిరంతరం కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని బోర్డు సీఈవో మధుకర్ నాయక్ అన్నారు. 'స్వచ్ఛతా హీ సేవా–2024' లో భాగంగా కంటోన్మెంట్ వర్క్‌షాపులో పారిశుద్ధ కార్మికుల కోసం బొల్లారం కంటోన్మెంట్ జనరల్ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో ఈ యేడాది మొదటి స్థానం సాధించేలా కృషి చేయాలని కోరారు. సుమారు 400 కార్మికులకు సాధారణ, దంత, కంటి, డయాబెటిక్, బీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ సీఈవో పల్లవివిజయ్ వంశీ, బోర్డు మెడికల్ ఆఫీసర్ రామకృష్ణ , బోర్డు హెల్త్ సూపరిటెండెంట్ ఎం. దేవేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేందర్, వైద్యులు, పారా మెడికల్ బృందం, ల్యాబ్ టెక్నిషియన్స్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గోపూజ



కాప్రా: భాగ్యనగర్ ఉత్సవ సమితి కాప్రా డివిజన్ కన్వీనర్ రేగళ్ల సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో కాప్రాలో గోపూజ నిర్వహించారు. అనంతపద్మనాభ చతుర్ధి సందర్భంగా లోకకల్యాణార్థం అశోక్ మణిపురికాలనీ లలితాదేవి ఆలయం, నేతాజీనగర్ చౌరస్తాలో గోపూజ నిర్వహించినట్లు చెప్పారు. ఉత్సవ సమితి సభ్యులు కమల్‌పంత్ తల్లావజ్జుల, కొప్పుల కుమార్, భానుమతి, అమిత్, గీతాగురు తదితరులు పాల్గొన్నారు.

రాజ్ నేతా సమ్మేళనంలో రాష్ట్ర నాయకులు

లాలాపేట: బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రాజస్థాన్‌లో జరిగిన రాజ్ నేతా సమ్మేళనంలో హైదరాబాద్ మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకులు బండ కార్తీకరెడ్డి, నాయకుడు బండ చంద్రారెడ్డి పాల్గొన్నారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించడంలో బ్రహ్మకుమారీస్ చేస్తున్న సేవలను కార్తీకరెడ్డి ప్రశంసించారు. రాజకీయ నాయకుల్లో ఆధ్యాత్మికతను పెంపొందించడం ద్వారా ప్రజలకు మెరుగైన పాలన అందుతుందనే అంశాలపై ఈ సమావేశాల్లో చర్చించినట్లు ఆమె తెలిపారు.